క్లుప్తంగా

బాలుడి కుటుంబానికి రూ.3లక్షల సాయం

నరసరావుపేట: పట్టణంలోని రెడ్డినగర్‌లో నిర్మాణంలో ఉన్న అపార్టుమెంటులో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన షేక్ నసీం కుటుంబానికి శనివారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి రూ.3లక్షల ఆర్థిక సాయం అందజేశారు. 34వ వార్డులోని బీసీ కాలనీలో నసీం స్వగృహానికి వెళ్లి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో షేక్ ఆదం, షేక్ బాజీ, కాకుమాను సదాశివరెడ్డి పాల్గొన్నారు.

నేడు ఇర్లపాడులో విగ్రహ ప్రతిష్ట

శావల్యాపురం: మండలంలోని ఇర్లపాడులో ఆదివారం సీతారామచంద్ర విగ్రహ ప్రతిష్టను వేద పండితుడు పరుచూరి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 6.58 గంటలకు విగ్రహ ప్రతిష్ట అనంతరం అనంతరం స్వామి శాంతి కల్యాణ వేడుకలు, మహదాశీర్వచనం, మంగళహారతి కార్యక్రమాల అనంతరం అన్నదానం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొనాలని సభ్యులు కోరారు.

అర్హులైన వారందరికీ పథకాలు అందజేయాలి

రొంపిచర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గడ్డం బాలనాగమ్మ అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా చేపట్టిన పనుల పురోగతిని సమీక్షించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, పథకాల్ని అర్హులైన వారందరికీ అందజేయాలని ఎంపీపీ అధికారులకు సూచించారు. సమావేశంలో ఎంపీడీవో మాథ్యూ బాబు, తహసీల్దార్ అంకారావు, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 42మందికి ఉద్యోగాలు

నరసరావుపేట ఈస్ట్: శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో టెక్ మహేంద్ర సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 42మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ సోము మల్లయ్య తెలిపారు. టెక్ మహేంద్ర సంస్థ హెచ్ఆర్ ఆర్.విశాలాక్షి ఆధ్వర్యంలో విద్యార్థులకు రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, హెచ్ఆర్ రౌండ్స్ నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేసినట్టు ఆయన వివరించారు. ఎంపికైన విద్యార్థులు తృతీయ సంవత్సరం డిగ్రీ పూర్తి చేసిన అనంతరం విధుల్లో చేరాలని, రూ.2.75 లక్షల వార్షిక వేతనం లభిస్తుందని తెలిపారు. విద్యార్థుల్ని కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎస్.సురేష్‌బాబు, ఆంగ్ల భాషా శిక్షకుడు ఎం.విశ్వేశ్వరరావు అభినందించారు.

సోలార్ పంపు సెట్ల వైర్ల చోరీ

నాదెండ్ల: గణపవరం పంట పొలాల్లో సోలార్ పంపు సెట్ల విద్యుత్ వైర్ల చోరీ ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కొర్నెగంటి మస్తాన్‌రావుకు కావూరు డొంక రోడ్డులో ఎకరం పొలం ఉంది. అందులో ప్రభుత్వ సబ్సిడీపై సోలార్ పంపుసెట్టును ఏర్పాటు చేసుకుని తైవాన్ జామ సాగు చేసుకుంటున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి మోటార్ నుంచి స్టార్టర్‌కు వెళ్లే బాక్స్ కేబుల్ వైరు, ప్యానెల్ సెట్ల మధ్య కాపర్ వైరును దుండగులు కత్తిరించుకెళ్లారు. గతంలో కూడా నాలుగు పర్యాయాలు చోరీ జరిగినట్లు బాధిత రైతు వాపోయాడు. వైర్ల చోరీతో నిందితులకు వచ్చేది కొద్దిమొత్తమైనా, రైతులకు మాత్రం తీవ్ర నష్టం వాటిల్లుతోందని వాపోయాడు. చోరీలపై పోలీసులు చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

మొక్కజొన్న రైతులకు అండగా ఉంటాం

- జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్
- పాలపాడులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

నరసరావుపేట రూరల్: మొక్కజొన్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వ అండగా ఉంటుందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. మండలంలోని పాలపాడులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ వారం రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల వల్ల రైతులు ఇబ్బందికర పరిస్థితుల్ని ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వారికి అండగా నిలబడాలని అధికారుల్ని ఆదేశించినట్టు చెప్పారు. ఈ ఏడాది మొక్కజొన్న నాణ్యతతో పాటు అధిక దిగుబడులు ఇచ్చిందని, దీనివల్ల మార్కెట్‌లో అధిక రేటు కూడా వచ్చిందని తెలిపారు. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా రేటు తగ్గిందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్ని ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. పాలపాడులో 50మంది రైతులు ఇప్పటికే పంటను విక్రయించేందుకు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్టు పేర్కొన్నారు. ఈ–క్రాప్ నమోదుతో పాటు బ్యాంక్ ఖాతాకు ఆధార్ లింక్ అయ్యి ఉండాలని సూచించారు. దీనిపై ఏమైనా సమస్యలుంటే వీపీఏను సంప్రదించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించే రైతులు పంటను ఆరబెట్టుకుని రావాలన్నారు. ప్రతి రైతు నుంచి పంటను కొనుగోలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి, మార్క్ ఫెడ్ డీఎం ఆర్.జె .కృష్ణారావు, వ్యవసాయ సంచాలకులు రవికుమార్, పి.మస్తానమ్మ, మండల వ్యవసాయ అధికారి నరేంద్ర బాబు, గ్రామ సర్పంచ్ సైకం సత్యనారాయణ రెడ్డి, ఏఈవో గోపిరెడ్డి, వీపీఏ బోస్, పి.పవన్‌కుమార్ పాల్గొన్నారు.



పాలపాడులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్

మొక్కజొన్న పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

ఈపూరు : అకాల వర్షాలతో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోలు చేస్తుందని వినుకొండ వ్యవసాయ సహాయ సంచాలకులు బి.రవిబాబు తెలిపారు. మండలంలోని కొచ్చర్లలో మొక్కజొన్న పంట పొలాల్ని ఆయన పరిశీలించారు. రైతులకు సూచనలు, సలహాలతో పాటు సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కజొన్న పంట పండించిన ప్రతి రైతు తమ పేర్లను కొనుగోలు కేంద్రాల్లో నమోదు చేయించుకోవడం ద్వారా మద్దతు ధరకు అమ్ముకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఆర్. రామారావు, మండల వ్యవసాయ విస్తరణ అధికారి బి.అప్పారావు, గ్రామ వ్యవసాయ సహాయకుడు కె.కిశోర్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.



ఈపూరు మండలం కొచ్చర్లలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏడీఏ రవిబాబు

శావల్యాపురంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

శావల్యాపురం: స్థానిక సొసైటీ కేంద్రంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ అధికారులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడీఏ బోయపాటి రవిబాబు మాట్లాడుతూ ఈ–క్రాప్ నమోదు చేసుకున్న మొక్కజొన్న రైతులంతా తక్షణమే రైతుభరోసా కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. మార్కెఫెడ్ సౌజన్యంతో ప్రభుత్వం మద్దతు ధర రూ.1960కు కొనుగోలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు ఏఈవో పురేటి అశోక, వీఏలు వరలక్ష్మి, స్రవంతి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'మా నమ్మకం నువ్వే జగన్' విజయవంతం

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం విజయవంతమవ్వడం శుభపరిణామమని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా కోటి 20 లక్షల కుటుంబాల్ని కలుసుకోగా, వినుకొండ నియోజకవర్గంలో 94 వేల కుటుంబాల్ని కలిసినట్లు చెప్పారు. ఇందులో 75 వేల కుటుంబాలు ఫోన్ ద్వారా మద్దతు తెలియజేసినట్లు చెప్పారు. మొత్తం 89 శాతం కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేశామని పేర్కొన్నారు.

నష్టపోయిన రైతులకు ప్రభుత్వం సాయం

ఇటీవల అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటల్ని గుర్తించి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి ఆదుకోవాలని, నష్టపరిహారం అంచనా వేయాలని ఇప్పటికే ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అధికారుల్ని ఆదేశించారని ఎమ్మెల్యే బొల్లా తెలిపారు. ముఖ్యమంత్రి ప్రకటన తరువాత ప్రతిపక్ష నేత చంద్రబాబు రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని అనడం సిగ్గుచేటని ఖండించారు. వినుకొండ మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుకు ముఖ్యమంత్రిని విమర్శించే స్థాయి లేదని, పదేళ్ల ఎమ్మెల్యేగా ఉండి కనీసం పట్టణ ప్రజలకు తాగునీరు కూడా ఇవ్వలేక పోయారని విమర్శించారు. ముఖ్యమంత్రి సహాయ సహకారాలతో పువ్వాడ, గోకనకొండ, నాగిరెడ్డిపల్లి, కొత్తపాలెం మధ్యలో గుండ్లకమ్మ నదిపై రెండు నూతన వంతెనల నిర్మాణం చేస్తున్నామని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. రెండు జిల్లాల్ని కలుపుతూ పువ్వాడ, కొమ్మాలపాడు వరకు గుంటూరు, ప్రకాశం జిల్లాల్ని కలుపుతూ నూతన రహదారుల్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు. వినుకొండ నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయలతో రోడ్లు, ఘాట్ రోడ్డు పనులు చేస్తున్నామని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే తమ హయాంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్ని చూసి ఓర్చుకోలేక పోతున్నారని, రానున్న రోజుల్లో ప్రజలు వైఎస్సార్ సీపీకే మద్దతుగా ఉన్నారని తెలిపారు. 2024 ఎన్నికల్లో మరలా తమ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లుయాదవ్, మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డి, వార్డు కౌన్సిలర్ షకీలా దస్తగిరి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

ఆలయాల్లో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

విఠంరాజుపల్లిలో శనివారం శ్రీ అభయ ఆంజనేయ స్వామి తిరునాళ్ల ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు ఆయనకు ఘన స్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. మండలంలోని ఇనిమెళ్లలో శ్రీ భావన్నారాయణస్వామి తిరునాళ్లను శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భద్రుపాలెంలోని శ్రీ నిదానంపాటి శ్రీ లక్ష్మీ అమ్మవారి ఆరో వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని బొమ్మరాజుపల్లిలో శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానం తొమ్మిదో వార్షికోత్సవంలో ఎమ్మెల్యే బొల్లా పాల్గొన్నారు. స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

నిర్మాణాల్లో ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

పొడా వైస్ చైర్మన్ గజ్జల శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట: ప్రభుత్వ నిబంధనల మేరకే యజమానులు నిర్మాణం చేసేలా లైసెన్స్‌డ్ మున్సిపల్ ఇంజనీర్లు వ్యవహరించాలని పల్నాడు జిల్లా పట్టణాభివృద్ధి సంస్థ (పొడా) వైస్ చైర్మన్ గజ్జల శ్రీనివాసరెడ్డి సూచించారు. ప్లాన్లకు డీపీఎంఎస్(డెవలప్మెంట్ పర్మిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) వెబ్‌సైటు ద్వారా అనుమతులు ఇప్పించే క్రమంలో అవసరమయ్యే ప్రీ డీసీఆర్ శిక్షణ కార్యక్రమాన్ని వినుకొండ రోడ్డులోని ప్రైవేట్ హోటల్‌లో శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ త్వరలో జిల్లాలోని ఇంజనీర్లు అందరికీ లాగిన్ ఇస్తామని తెలిపారు. భవన నిర్మాణ సమయంలో ప్రభుత్వ నిబంధనలు అనుసరిస్తే పట్టణం అందంగా రూపొందుతుందని, లేనిపక్షంలో భవిష్యత్ తరాలకు సమస్యలు ఎదురవుతాయని హెచ్చరించారు. అనంతరం ముఖ్య అతిథితో పాటు పొడా ప్లానింగ్ ఆఫీసర్ బొంతు గురువారెడ్డి, ఏపీ లైసెన్స్‌డ్ ఇంజనీర్స్ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి కొమ్మసాని కమలాకరరెడ్డిని ఇంజనీర్లు దుశ్శాలువతో సత్కరించారు. ఇంజనీర్ల సమస్యలపై అధికారులు చర్చించారు. వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తొలుత ఇంజనీర్ల పితామహుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు మారెళ్ల రామాంజనేయులు, బి.వెంకటనారాయణ, సహాయ కార్యదర్శి ఎ.శ్రీనివాసరావు, నరసరావుపేట కార్యదర్శి బి. శ్రీనివాసరసింగ్, కోశాధికారి జి. అనిల్, వినుకొండ, చిలకలూరిపేట, సత్తెనపల్లి చెందిన పలువురు ఇంజనీర్లు పాల్గొన్నారు.



పొడా వైస్ చైర్మన్ శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న లైసెన్స్‌డ్ ఇంజనీర్ల అసోసియేషన్ ప్రతినిధులు

అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే చర్యలు

చిలకలూరిపేట: అధిక ధరలకు విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని నరసరావుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు పి. మస్తానమ్మ హెచ్చరించారు. నియోజకవర్గ పరిధిలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల డీలర్లతో పట్టణంలోని వెంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో డీలర్లు లైసెన్స్‌లో అవసరమైన మార్పులు చేసుకోవాలని సూచించారు. సరైన స్టాక్ రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలు నిర్వహించాలని తెలిపారు. రైతులు కోరిన విత్తనాలు మాత్రమే సరైన ధరలకు అమ్మాలని, మభ్యపెట్టి వేరే రకాలు అంటగట్టరాదని చెప్పారు. విత్తనాలు, ఎరువుల కృతిమ కొరత సృష్టిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్టాక్ రిజిస్టర్లు, బిల్లు పుస్తకాల్ని సంబంధిత అధికారి వద్ద సర్టిపై చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో చిలకలూరిపేట ఇన్‌చార్జి మండల వ్యవసాయాధికారి ఎ. హరికృష్ణ, యడ్లపాడు ఎంఏవో సరిత, ఏఈవో జీపీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సహాయ వ్యవసాయ సంచాలకులు మస్తానమ్మ

చక్రస్నానం.. సర్వ పాపహరణం

యడ్లపాడు: మండలంలోని సొలసలో శ్రీభూ సమేత రంగనాయకస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు శనివారం ఆరో రోజుకు చేరాయి. ఉదయం సుప్రభాత సేవ, బిందెతీర్థం, అర్చన, నిత్యహోమం, బలిహరణ, వసంతోత్సవం, పూర్ణాహుతి, ధ్వజారోహణ కార్యక్రమాలు జరిగాయి. బ్రహ్మోత్సవాల్లో ముగింపు దశలో కీలకమైన చక్రస్నానాన్ని కన్నుల పండువలా నిర్వహించారు. ముందుగా చక్ర పెరుమాళ్ల స్వామిని పండితులు ఊరేగించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు పర్చూరి రామకృష్ణమాచార్యులు నేతృత్వంలో వైదిక బృందం పర్చూరి రాఘవేంద్ర, పర్చూరి నితిన్‌కుమార్, నారాయణం లక్ష్మణాచార్యులు ఆధ్వర్యంలో చక్రస్నాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ధర్మకర్తలు, భక్తులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు. అనంతరం యాగశాలలో పూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు అర్వపల్లి మనోహర్, నాగజ్యోతి, అర్వపల్లి సాంబశివరావు, కామేశ్వరీదేవి, అర్వపల్లి వెంకటస్వామి, వెంకట రాజరాజేశ్వరీ దంపతులు, అర్వపల్లి శాయిశ్రీ మేఘన పాల్గొన్నారు. ఏర్పాట్లను గ్రామపెద్దలు, ఈవో సీహెచ్. శివయ్య పర్యవేక్షించారు.



సొలస దేవస్థానం ప్రాంగణంలో చక్రస్నానం చేస్తున్న భక్తులు

కేంద్ర ప్రభుత్వ విధానాలతో సామాన్యుడిపై పెనుభారం

చిలకలూరిపేట: కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసరాల ధరల్ని విపరీతంగా పెంచి సామాన్యుడిపై పెనుభారం మోపుతోందని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు విమర్శించారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెంచిన గ్యాస్ ధరల్ని తగ్గించాలని కోరుతూ రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ కేంద్రంలో ప్రధానిగా మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల జీవితాలు ఛిద్రమయ్యాయని ఆరోపించారు. పెట్రో, గ్యాస్ ధరలు పెంచి రూ. 20లక్షల కోట్ల ఆదాయాన్ని కేంద్ర ప్రభుత్వం ఆర్జించిందని ఆరోపించారు. పూర్తిగా గ్యాస్ సబ్సిడీ ఎత్తివేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతో మంది బలిదానాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును కేంద్రం కారుచౌకగా అమ్మకానికి పెట్టిందని, కార్మికులు పెద్దఎత్తున ఉద్యమిస్తున్నా లెక్కచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలు ఐక్యంగా మెలిగి మోదీ ప్రభుత్వం గద్దె దిగేలా పోరాడాలని కోరారు. మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి నాగబైరు రామసుబ్బాయమ్మ, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం. రాధాకృష్ణ, సీపీఎం పట్టణ కార్యదర్శి పేరుబోయిన వెంకటేశ్వర్లు, లోక్‌సత్తా పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ మాదాసు భానుప్రసాద్, ఎమ్మార్పీఎస్ నాయకుడు అడపా మోహన్, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ షేక్ సుభాని, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

వైభవంగా రాజేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



స్వామి కల్యాణ వేడుకల్లో భక్తులు

యడ్లపాడు: స్థానిక గంగా పార్వతీ సమేత రాజేశ్వర స్వామి దేవస్థానం శనివారం భక్తులతో కళకళలాడింది. ఆలయం ఆరో వార్షికోత్సవ వేడుకల్ని అభివృద్ధి కమిటీ, గ్రామపెద్దలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు జంధ్యాల శ్రీరామచంద్ర మూర్తి స్వామికి పంచామృత అభిషేకాలు, విశేష అలంకారాలు, పట్టు వస్త్రాలు, వివిధ పుష్పాలతో అలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం కల్యాణ మంటపంలో మహాశివుడు, పార్వతీదేవికి సంప్రదాయబద్ధంగా శాంతి కల్యాణం జరిపారు. పెళ్లి పీటలపై బోడి జగన్‌మోహన్‌రావు, పద్మావతి దంపతులు కూర్చొని పూజలు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ముత్తవరపు సురేష్ బాబు, ఉప్పలపాటి శ్రీనివాసరావు, పోపూరి సోమయ్య, రామిశెట్టి ఆంజనేయులు, మాదం నాగేశ్వరరావు, నాదెండ్ల శ్రీనివాసరావు పర్యవేక్షించారు. ఆయా కార్యక్రమాలకు విచ్చేసిన మూడు వేల మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు.

నేడు శ్రీ అంకాల పరమేశ్వరి తిరునాళ్ల

ఈపూరు : మండలంలోని కొచ్చర్లలో ఆదివారం శ్రీ అంకాల పరమేశ్వరి అమ్మవారి తిరునాళ్ల జరగనుంది. ఈ సందర్భంగా దేవాలయాన్ని నూతన హంగులతో అలంకరించి సిద్ధం చేశారు. తిరునాళ్లలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ వెంకట్రావు బందోబస్తు నిర్వహించనున్నారు.

రేపటి నుంచి వేసవి శిక్షణ శిబిరాలు

రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు, రొంపిచర్ల శాఖా గ్రంథాలయాల్లో ఈ నెల ఎనిమిదో తేదీ నుంచి వచ్చే నెల 11 వరకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయా శాఖా గ్రంథాలయాల అధికారులు కె.వెంకట్రావు, సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్న శిబిరంలో విద్యార్థులకు కథలు వినడం, చదవడం, రాయడం, డ్రాయింగ్, పెయింటింగ్‌లపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పుస్తక పఠనంపై అవగాహనతో ఆటల పోటీల్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులంతా తమ పిల్లల్ని శిక్షణ శిబిరాలకు పంపి విజయవంతం చేయాలని వారు కోరారు.

పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విజయభేరి

వినుకొండ(నూజెండ్ల): క్లస్టర్ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. నూజెండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో 138 పరీక్షలకు హాజరు కాగా 88 మంది, ములకలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 37 మంది హాజరుకాగా 31 మంది ఉత్తీర్ణులయ్యారు. మోడల్ స్కూల్లో 85 మంది హాజరుకాగా 50మంది ఉత్తీర్ణులయ్యారు.

శావల్యాపురం : మండలంలోని ఐదు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో 263 మందికి గానూ 171మంది పాసై, 65.5 శాతం ఉత్తీర్ణత వచ్చినట్లు ఎంఈవో మద్దికుంట సాంబశివరావు శనివారం తెలిపారు. శావల్యాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల్లో 87 మందికి గానూ 40 మంది, వేల్పూరు హైస్కూల్లో 56 మందికి 44 మంది, మతుకుమల్లి హైస్కూల్లో 27 మందికి గాను 17 మంది, పోట్లూరు హైస్కూల్లో 45మందికి 38 మంది, కారుమంచి హైస్కూల్లో 49 మంది విద్యార్థులకు గాను 32 మంది పాసైనట్లు ఆయన చెప్పారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాలాది శ్రీనివాసరావు, కె.విజయ్‌భాస్కర్‌రావు, జంగాల అనిత, శంకరరంగారావు, ఉపాధ్యాయులు, పేరెంట్ కమిటీ చైర్మన్లు, కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు.

వినుకొండ టౌన్ : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో సత్తా చాటి 94.57శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జి. విజయలక్ష్మి శనివారం పేర్కొన్నారు. పాఠశాల నుంచి 92 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 87 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ఇందులో 42 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారని పేర్కొన్నారు.

ఈపూరు : మండలంలోని పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 72.39 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో బాబురెడ్డి తెలిపారు. ఇనిమెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 54 శాతం, జెడ్పీహెచ్ఎస్ ముప్పాళ్ల 46శాతం, జెడ్పీహెచ్ఎస్ ఈపూరు 70.5శాతం, కేజీబీవీ ఈపూరు 44.44 శాతం, మోడల్ స్కూల్ 83, బొగ్గరం జెడ్పీహెచ్ఎస్ 93, జెడ్పీటీసీఎస్ కొచ్చర్ల 75 , జెడ్పీహెచ్ఎస్ కొండ్రముట్ల 88 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో వివరించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల్ని ఆయన అభినందించారు.

బొల్లాపల్లి : పదో తరగతి పరీక్షల్లో మండలం నుంచి 60.5శాతం ఫలితాలు నమోదయ్యాయి. మండలంలో నాలుగు జెడ్పీ హైస్కూల్స్, మోడల్ స్కూల్, కేజీబీవీ నుంచి 388 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 235మంది ఉత్తీర్ణులయ్యారని ఇన్‌చార్జి ఎంఈవో వి.ఏసుబాబు తెలిపారు.

రొంపిచర్ల : పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో 56.12 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని మండల విద్యాశాఖాధికారి కె.వి.బాబు రెడ్డి శనివారం వెల్లడించారు. మొత్తం 351 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 197మంది ఉత్తీర్ణులైనట్లు చెప్పారు. బుచ్చిపాపన్నపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముగ్గురికి గాను ఒక్కరు, సంతగుడిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 56 మందికి గాను 30 మంది, సంతగుడిపాడు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 34 మందికి గాను 23 మంది, వి.రెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 84 మందికి 36 మంది, వి.రెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూలులో 87 మందికి 65 మంది, కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 15 మందికి ఎనిమిది మంది, రొంపిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 45 మందికి 20 మంది, గోగులపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 27 మందికి 14 మంది ఉత్తీర్ణులయ్యారని ఆయన వివరించారు. పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల్ని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

నరసరావుపేట రూరల్ : పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. యల్లమంద జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఏడుగురు విద్యార్థులు 550కు పైగా మార్కులు సాధించారు. శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఉప్పలపాడు వైవీఎస్ఆర్ అండ్ వైవీఆర్ జిల్లా పరిషత్ హైస్కూల్ 63.5శాతం ఉత్తీర్ణత సాధించింది.

యడ్లపాడు : మండలంలో 460 విద్యార్థులు హాజరుకాగా, వీరిలో 253 మంది ఉత్తీర్ణులై 55శాతంలో నిలిచింది. సందెపూడి జెడ్పీలో 19మందికి 15 మంది ఉత్తీర్ణులై 78.95శాతం గరిష్ఠంగా నమోదు చేసింది. సొలస జెడ్పీలో 58కి 45 మంది ఉత్తీర్ణులై 77.59శాతం నిలిచింది. జెడ్పీ ఉన్నవలో 103కి 63 మంది ఉత్తీర్ణులై 61.17శాతం, వంకాయలపాడు జెడ్పీ 26కి 15 మంది ఉత్తీర్ణులై 57.69శాతం, జెడ్పీ లింగారావుపాలెంలో 63కి 36 మంది ఉత్తీర్ణులై 57.14శాతం, జెడ్పీ జగ్గాపురం 21కి 12మంది ఉత్తీర్ణులై 57.14 శాతం, వంకాయపాడు గురుకులలో 72కి 38 మంది ఉత్తీర్ణులై 52.78శాతం, జెడ్పీ కారుచోల 19కి 10 మంది ఉత్తీర్ణులై 52.63శాతం, జెడ్పీ యడ్లపాడులో 26కి 10 మంది ఉత్తీర్ణులై 38.46శాతం, జెడ్పీ తిమ్మాపురంలో 24కి ఐదుగురు ఉత్తీర్ణులు 20.83శాతం, యడ్లపాడు లూథరన్ హైస్కూల్ 29కి నలుగురు ఉత్తీర్ణులై 13.79శాతంలో నిలిచాయి.

నాదెండ్ల : మండలం నుంచి 750 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 523 మంది (69.73 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఉన్నత పాఠశాలల్లో చిరుమామిళ్ల నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అత్యధికంగా 98.61 శాతం ఉత్తీర్ణత కాగా, అత్యల్పంగా 46.15 శాతంతో నాదెండ్ల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం నిలిచింది. నాదెండ్ల పాఠశాలలో 47.69, తూబాడులో 62.22, సాతులూరులో 57.61, సంకురాత్రిపాడు 84, గణపవరం 63.10, అమీన్‌సాహెబ్‌పాలెం 54.29, ఎండుగుంపాలెంలో 67.74, కనపర్రులో 66.67, చిరుమామిళ్ల ఏపీ మోడల్ పాఠశాల 87.50 శాతం ఉత్తీర్ణత సాధించారు.

ఓరియంటల్ స్కూలు వ్యవస్థాపకుడు నరసింహాచార్యులు మృతి

నరసరావుపేట: శ్రీ రామకృష్ణా ఓరియంటల్ స్కూలు వ్యవస్థాపకుల్లో ఒకరైన వేదాంతం నరసింహాచార్యులు(85) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి స్వగృహంలో మృతి చెందారు. ఆయన నరసరావుపేటలో స్కౌట్ విభాగ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. ఆయన భౌతికకాయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మానవ హక్కుల సంఘ మాజీ చైర్మన్ కాకుమాను పెదపేరిరెడ్డి, టీడీపీ నాయకుడు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, కాకుమాను ఫౌండేషన్ చైర్మన్ కాకుమాను సదాశివరెడ్డి, మాజీ కౌన్సిలర్ కారుమంచి మీరావలి తదితరులు సందర్శించి నివాళులర్పించారు.